ఆదాయం పెంచుతాం... పేదలకు పంచుతాం

- ఇదే ప్రభుత్వ విధానం
- సామాజిక న్యాయానికి తొలి ప్రాధాన్యత
- విద్యుత్ రంగాన్ని గాడిన పెడుతున్నాం
- వ్యవస్థలోని గంజాయి మొక్కల్ని పెకలిస్తాం
- చేరికలకు తెరిచింది ఒకే గేటు...
- ఫోన్‌ట్యాపింగ్‌పై కేంద్రం విచారణకు ఆదేశించాలి
- నిజాంకు నకలు కెసిఆర్
- మీట్ ది ప్రెస్‌లో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ఆదాయం పెంచి, పేదలకు పంచడమే తమ ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దానికోసం వ్యవస్థలను ప్రక్షాళన చేస్తూ, దుబారాను కట్టడి చేస్తున్నామనీ, అనవసర వ్యయాలు తగ్గిస్తే ఆదాయం పెరిగినట్టేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజె) ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 'మీట్ ది ప్రెస్' నిర్వహించారు. దీనిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని వందరోజులు పాలన, ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలు వివరించారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. "దుబారా తగ్గిస్తే, సంపద సృష్టించినట్టే. ప్రాధాన్యతలు నిర్ణయించుకొని, దుర్వినియోగాన్ని నియంత్రిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మ్యాచింగ్ గ్రాంట్‌లు ఉంటాయి. ఇది సాగునీటి ప్రాజెక్టులకూ వర్తిస్తుంది. 2015లో మోడీ సర్కారు జాతీయ ప్రాజెక్టుల విధానాన్నే రద్దు చేసింది. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎప్పుడు ఢిల్లీ వెళ్లినా జాతీయ ప్రాజెక్ట్ ఇవ్వాలని లెటర్ ఇచ్చి వచ్చేవారు. ఆ స్కీమే లేనప్పుడు లెటర్లు ఇచ్చి ఏం ప్రయోజనం. కేంద్రం పిఎమ్‌కెఎస్‌వై అనే కొత్త పథకం తెచ్చింది. దానిలో నిర్ణీత ఫార్మట్‌లో దరఖాస్తు చేసుకుంటే కేంద్రం నుంచి నిధులు వస్తాయి. 60 శాతం కేంద్ర నిధులు ఇస్తే, రాష్ట్రం 40 శాతం నిధుల్ని ఖర్చు చేస్తుంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును ఆ ఫార్మట్‌లో దరఖాస్తు చేసుకోమని చెప్తే, కెసిఆర్ వినలేదు. కేంద్రమంత్రి షెకావత్ ఇదే విషయాన్ని మాకు చెప్పారు. వెంటనే ఫార్మట్ మార్చి మేం దరఖాస్తు చేసుకున్నాం. కేంద్ర పథకాలను వినియోగించుకోవడం రాష్ట్రాల హక్కు. దీనివల్ల ప్రాజెక్టుల కోసం కొత్తగా అప్పులు చేయాల్సిన అవసరం ఉండదు. అది సంపద సృష్టే. దీనిపై మా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే మొదటి నెలలో రూ.289 కోట్ల అదనపు ఆదాయం వచ్చింది. రెండో నెలలో రూ.550 కోట్లు, ఈ నెల రూ.700 కోట్లకు ఆదాయం చేరుతున్నది. వచ్చే మూడు నెలల్లో ప్రభుత్వానికి ప్రతినెలా కనీసం రూ.వెయ్యి కోట్ల ఆదాయం దీని నుంచే వస్తుంది. ఎక్సైజ్ శాఖ టానిక్ అనే సంస్థపై దాడులు చేసి, లెక్కల్ని బయటకు తీస్తే ఒక్క నెలలోనే దాదాపు రూ.200 కోట్ల పన్ను ఎగవేత బయటపడింది. ప్రతినెలా రూ.వెయ్యి కోట్లు అదనంగా వస్తే ఆ సొమ్ము సంక్షేమ పథకాలకు అక్కరకు వస్తుంది" అని రేవంత్‌రెడ్డి వివరించారు. గృహజ్యోతి స్కీంపై స్పందిస్తూ రేషన్‌కార్డులు ఉన్నవారందరికీ కరెంటు కనెక్షన్లు ఉండవు. కొందరు ఆరోగ్య శ్రీ కోసం, మరికొందరు బియ్యం కోసం రేషన్‌కార్డులు తీసుకున్నారు. గ్రామసభల్లో గృహజ్యోతి కోసం 62 లక్షల దరఖాస్తులు వచ్చాయి. డేటా ఎనాలిసిస్‌తో సరిపోల్చితే 42 లక్షల దరఖాస్తులు అర్హమైనవిగా తేలాయి. వారిలో 38 లక్షల మందికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఇది నిరంతర ప్రక్రియ. అర్హులందరికీ ఇస్తాం. అనర్హులకు ఒక్కరికీ ఇవ్వం" అని స్పష్టం చేశారు. "కాంగ్రెస్‌పార్టీ సామాజిక న్యాయానికి తొలి ప్రాధాన్యత ఇస్తుంది. సీఎంఓ నుంచి కిందిస్థాయి వరకు పగడ్బందీగా సామాజిక సమతుల్యత బాధ్యతను తీసుకుంటాం.' అని అన్నారు. "ప్రభుత్వ జీవోలు దాచాల్సిన అవసరం మాకు లేదు. దీనిపై ఇటీవలే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మాట్లాడాను. పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తాం. అన్నీ ఆన్‌లైన్‌లో పెడతాం. త్వరలోనే సమాచార శాఖ కమిషనర్ల నియామకం చేపడతాం" అని అన్నారు.

"ధరణి నిర్వహణ గతంలో ప్రయివేటు సంస్థ చేతిలో ఉంటే, దాన్ని సీజీజీకి అప్పగించాం. ఈ పోర్టల్‌ను ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తే తప్ప, మరిన్ని వివరాలు వెల్లడయ్యే పరిస్థితి లేదు. 2014 కు ముందు ఉన్న భూములు ఎవరి పేర్లపై ఉన్నాయి. తర్వాత పేర్లు ఎలా మారాయి. ప్రభుత్వ భూములు పెద్దల పేర్లపైకి ఎలా వచ్చాయనే విషయాలు తేలాలంటే ఫోరెన్సిక్ ఆడిట్ తప్పనిసరి. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. తప్పులకు కారకులను గుర్తించి, కచ్చింతంగా చట్ట ప్రకారం శిక్షిస్తాం" అని చెప్పారు.

'ఫోన్‌ట్యాపింగ్‌పై ఈటల రాజేందర్‌కు చెందిన పార్టీనే కేంద్రంలో ఉంది. విచారణకు ఆదేశించమని చెప్పండి. ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. గత ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్‌లు చేసినవాళ్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారో అందరూ చూస్తూనే ఉన్నారు. చిల్లర మల్లర ఆరోపణల ద్వారా ఈటల ఎలాంటి ప్రయోజనం పొందరు. నిన్న వాళ్ల దగ్గరి మిత్రుడి వద్ద రూ.7 కోట్లు పట్టుబడ్డాయి. బహుశా ఫోన్ ట్యాపింగ్ వల్ల సమాచారం తెలిసిందని ఆయన అనుకుంటున్నారేమో...అలాంటిదేం లేదు. అక్కడ ఉన్నవారే సమాచారం ఇచ్చారు. డబ్బులు దొరికాయి" అని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఆందోళన వద్దు

రైతు భరోసాపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇప్పటి వరకు 5 ఎకరాలు ఉన్న 68 లక్షల మందికి ఖాతాల్లో డబ్బులు పడ్డాయి. ప్రభుత్వం ఇచ్చే ఏ సంక్షేమ కార్యక్రమం కావాలన్నా దరఖాస్తు చేసుకోవాలి. దాన్ని పరిశీలిస్తాం. అనర్హులకు ఇవ్వం. 30 ఏండ్ల క్రితం ఏర్పడిన కాలనీలకూ లక్షల రూపాయలు రైతుబంధు కింద వస్తున్నాయి. నిజమైన లబ్దిదారులకే అమలు చేస్తాం" అని స్పష్టత ఇచ్చారు.

వెల్ఫేర్ బోర్డ్...

"విదేశాల్లో ఉన్నవారికోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని మంత్రివర్గ సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నాం. విధివిధానాలకు ఆదేశించాం. ఎలక్షన్ కోడ్ ముగిశాక దీనికి శాశ్వత పరిష్కారం కల్పిస్తాం. విదేశీ దళారుల వ్యవస్థ లేకుండా చేయాలని ఆలోచిస్తున్నాం. ప్రభుత్వమే వివిధ దేశాలతో సంప్రదించి, అక్కడి ఉద్యోగాల వివరాలు తెప్పించి, ఇక్కడి నుంచి వెళ్లాలనుకునే వారి వివరాలు నమోదు చేయించి, శిక్షణ ఇప్పించే శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. త్వరలో మంచి పాలసీతో ముందుకొస్తాం. ఏజెంట్లు కూడా ప్రభుత్వం వద్దే రిజిస్టర్ చేసుకోవాలి. దీనివల్ల ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుంది. ప్రజలు మోసగాళ్ల బారిన పడకుండా ఉంటారు" అని వివరణ ఇచ్చారు. "గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిజాం తరహాలో రాచరికాన్ని తీసుకురావాలని అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ చూశారు. తమ వారసులే అధికారంలో ఉండాలని నిజాం నవాబు ఎలాగైతో కోరుకున్నారో... కెసిఆర్ కూడా అలాగే చేయాలని భావించారు" అని విమర్శించారు.

మతోన్మాద, అవినీతి బిజెపిని చిత్తుగా ఓడించాలి

- కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు రాబట్టుకునే ప్రయత్నం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతోన్మాద, అవినీతి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని టిఎస్‌యుటిఎఫ్ భవన్‌లో ఆదివారం జరిగిన సిపిఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కుల, మతాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రాష్ట్రంలో ఏదో ఒక రూపంలో అలజడి సృష్టించి ప్రజల మధ్య అశాంతి కలిగిస్తూ లబ్ది పొందేందుకు చూస్తున్నారని అన్నారు. పదేళ్ల నరేంద్ర మోడీ పాలనలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఒరిగింది ఏమీలేదని ఆరోపించారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి ఏ ప్రభుత్వమూ మనం తినే ఆహారంపై టాక్స్ విధించలేదని, నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చిన్నపిల్లలు తాగే పాలు, బ్రెడ్ లాంటి వస్తువుల పైనా జిఎస్‌టి విధించి ప్రజల నడ్డి విరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు మొత్తం కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తూ ప్రజాధనాన్ని దోచి పెట్టారన్నారు. ఇన్ని సమస్యల నడుమ మోడీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఎన్నికల సమయంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించినంత మాత్రాన ప్రజలు ఆయనకు ఓటు వేస్తారనుకుంటే పొరపాటేనని తెలిపారు. ఎన్నికల బాండ్ల పేరుతో బిజెపి అవినీతి అక్రమాలకు పాల్పడిందని చెప్పారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆంజనేయులు, ఆర్ శ్రీనివాసులు, ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు ఎపి మల్లయ్య, బాల్ రెడ్డి, బాలస్వామి నరసింహ ఈశ్వర్, శంకర్, మల్లేష్, దశరథం, అశోక్, శివ వర్మ తదితరులు పాల్గొన్నారు.

పశుమిత్రలను కార్మికులుగా గుర్తించాలి

- సిఐటియు కార్యదర్శి జె వెంకటేశ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పశు మిత్రలను కార్మికులుగా గుర్తించి, వారికి కనీస వేతనాలు ఇవ్వాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సిఐటియు కార్యాలయంలో పశు మిత్రల సంఘం అధ్యక్షులు శారద అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా పశుమిత్రలు ఎలాంటి వేతనం, పారితోషకాలు లేకుండా పనిచేస్తున్నారన్నారని చెప్పారు. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత దానికి అనుబంధంగా ఉన్న పశు సంపదను కాపాడటంలో పశుమిత్రలు కీలక పాత్ర వహిస్తున్నారని తెలిపారు. పశువులకు సోకే 12 నుంచి 20 రకాల వ్యాధులకు వైద్యం చేస్తున్నారనీ, వీరి సేవలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు.

భువనగిరి పార్లమెంటు బరిలో సిపిఎం

- పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల బరిలో భువనగిరి నియోజకవర్గం నుంచి సిపిఎం పోటీ చేయనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ తెలిపారు. జనగామ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జనగామ నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఆదివారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇర్రి అహల్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి సొంతంగా 400 స్థానాలు గెలుచుకుంటుందని ఆ పార్టీ నాయకులు జోస్యం చెబుతున్నారని అన్నారు. ఈ మాటల్లో ఆ పార్టీ మతలబు ఏంటని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని మార్చాలంటే తమకు 400 స్థానాలు కావాలంటూ బిజెపి ఎంపి బహిరంగంగా చేసిన ప్రకటనకు ప్రధాని నరేంద్రమోడీ, సంఘ్ పరివార్ రహస్య అజెండాలో భాగమేనని తెలిపారు. త్వరలో నిర్వహించబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి గెలవకుండా ప్రజలు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. బిజెపి అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు సిపిఎం అన్ని విధాలా ప్రయత్నం చేస్తుందని, అందులో భాగంగానే భువనగిరి పార్లమెంట్ బరిలో సిపిఎం ఉంటుందని స్పష్టం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా సమస్యలే తమ ఏజెండాగా పనిచేసే సిపిఎం అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, పట్టణ కార్యదర్శి సభ్యులు జోగు ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్. విజేందర్, బి. నరేందర్, పి. ఉపేందర్, నాయకులు డి. సందీప్, బి. వెంకటమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్లు అతి పెద్ద కుంభకోణం

- ఎస్‌బిఐ ఆఫీసర్ల సంఘం డిప్యూటీ జనరల్ సెక్రెటరీ థామస్ ఫ్రాంకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల బాండ్లు దేశంలోనే అతి పెద్ద కుంభకోణమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఆఫీసర్ల సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ థామస్ ఫ్రాంకో అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "ఎన్నికల బాండ్లు... రాజకియాల్లో నల్ల డబ్బు" అనే అంశంపై ఆదివారం జరిగిన వెబినార్‌లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. నల్ల డబ్బు బయటకు తెస్తానని ఎన్నికలకు ముందు చెప్పిన బిజెపి అదే నల్ల డబ్బును ఎన్నికల బాండ్ల రూపంలో వైట్ మణీగా మారుస్తోందని ఆరోపించారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, బడా కాంట్రాక్టర్లు, వ్యక్తులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చడం, అందుకు బదులుగా వారి నుంచి ఎన్నికల బాండ్ల రూపంలో నిధులను సమీకరిస్తోందని విమర్శించారు. తమ మాట వినని వారిపై సిబిఐ, ఇడి, ఐటి దాడులు చేయించి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. 2017లో తీసుకొచ్చిన ఈ విధానంలో ఎవరు ఎన్ని నిధులిస్తున్నారు, ఎంత మొత్తం ఇస్తున్నారు అనే విషయం గోప్యంగా ఉంచారని తెలిపారు. ఫలితంగా ఈ నిధుల సేకరణలో అనేక అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు కలుగజేసుకోవడంతో ఈ పెద్ద కుంభకోణానికి బ్రేకులు పడ్డాయని తెలిపారు. కోర్టు ఆదేశించినా వివరాలు ఇవ్వడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాలయాపన చేసిందని విమర్శించారు. దేశంలో సిపిఎం లాంటి కొన్ని పార్టీలు మాత్రమే ప్రజల నుంచి నిధులు సమీకరించి పారదర్శకంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన వెబినార్‌లో వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

శారీ రన్ ప్రారంభించిన నారా బ్రాహ్మణి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తనైరా సంస్థ, బెంగళూరుకు చెందిన ప్రముఖ ఫిట్‌నెస్ కంపెనీ జెజె యాక్టివ్ సంయుక్తంగా హైదరాబాద్‌లో 'శారీ రన్' నిర్వహించాయి. పీపుల్స్ ప్లాజా వద్ద ఈ కార్యక్రమాన్ని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి జెండా ఊపి ప్రారంభించారు. సుమారు మూడు వేల మంది మహిళలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.నారా బ్రాహ్మణి మాట్లాడుతూ.. చీర సంప్రదాయంతో పాటు స్త్రీలకు గుర్తింపును తీసుకువస్తుందన్నారు. ఇది సాధికారతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. తనైరా సిఇఒ అంబుజ్ నారాయణ్ మాట్లాడుతూ.. చీరలు మహిళలకు హుందాతనం, గౌరవాన్ని ఇస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెజె యాక్టివ్ కోచ్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

2కే రన్‌లో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- ప్రభుత్వం, పోలీసు అధికారులు నిరంతర నిఘా పెట్టాలి
- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు
- ఒయు ఎన్‌సిసి గేట్ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు 2కే రన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, వాటిని నిర్మూలించడంలో ప్రభుత్వం, పోలీసు అధికారులు నిరంతర నిఘా పెట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ కోరారు. షహీద్ భగత్ సింగ్ వర్ధంతి స్మారక యువజన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "సే నోటు డ్రగ్స్" నినాదంతో ఉస్మానియా యూనివర్సిటీలో ఎన్‌సిసి గేట్ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు 2కే రన్ నిర్వహించారు. అంతకుముందు 2కే రన్ ప్రారంభించి.. వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో, హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా డ్రగ్స్-మాదక ద్రవ్యాల సరఫరా ఎక్కువైందని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు స్కూళ్లలో, కాలేజీల్లో గ్రామీణ ప్రాంతాల్లో చాక్లెట్స్, మత్తు పానీయాలు రూపంలో విరివిగా దొరుకుతున్నాయని తెలిపారు. వాటికి విద్యార్థి, యువత బానిసై అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా వీటిని అరికట్టడంలో ప్రభుత్వం, పోలీసులు మరింత నిఘా పెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీలు అధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరాలు, సే నో టూ డ్రగ్స్ సెమినార్లు, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో యువతలో ఐక్యతకు విద్యార్థులు, యువకులకు ఆటల పోటీలు, క్రికెట్ పోటీలు, షటిల్, వెయిట్ లిఫ్టింగ్, చెస్ పోటీలను, యువ కవి, గాయక సమ్మేళనం వంటి బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తూ.. వారిలో ఉన్న ప్రతిభను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నేడు దేశం ఎదుర్కొంటున్న సామాజిక వివక్షతలకు వ్యతిరేకంగా కులం, మతం పేరుతో జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా.. భగత్ సింగ్ కోరుకున్న అసమానతలు, వివక్షలు లేని సమాజాన్ని నిర్మించాలని, మతోన్మాదంపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ మాజీ నాయకులు శ్రీనివాస్, మహేందర్, విజయ్, శ్రీనివాసరావు, మారయ్య, డివైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హస్మి బాబు, ఎండి జావిద్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ రెడ్డి, లెనిన్ గువెరా, ఒయు కార్యదర్శి రవి, నాయకులు స్టాలిన్, వినయ్, ప్రశాంత్, వీరేందర్, శ్రీమన్, హస్మీత, సాహన, సాయి, వేమన తదితరులు పాల్గొన్నారు.

తుదిదశకు చర్లపల్లి టెర్మినల్ పనులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చర్లపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే టెర్మినల్ పనులు శరవేగంగా సాగుతున్నాయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ టెర్మినల్ కొద్దివారాల్లో ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఓ ప్రకటనలో పేర్కొంది. రూ.430 కోట్ల అంచనా వ్యయంతో కొత్త టెర్మినల్ నిర్మాణం పూర్తవుతోంది. ఇందులో మౌలిక వసతులతో పాటు, టికెట్ బుకింగ్ కౌంటరు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా వెయిటింగ్ హాళ్లు, విశ్రాంతి గదులు, ఎగ్జిక్యూటివ్ లాంజ్, రెస్టారెంట్ వంటి ఏర్పాట్లు అందుబాటులోకి వస్తాయని వివరించింది. ఇప్పటికే ఉన్న ఐదు ప్లాట్‌ఫాంలకు అదనంగా నాలుగు కొత్త ప్లాట్ ఫాంలు వస్తున్నాయని, 7 లిఫ్టులు, 6 ఎస్కలేటర్ల ఏర్పాటు, చర్లపల్లి నుంచి రైళ్ల రాకపోకలు మొదలయ్యేలా కోచ్ నిర్వహణ సౌకర్యాలనూ ఏర్పాటుచేస్తున్నట్లు ద.మ. రైల్వే తెలిపింది.

మియాపూర్‌లో చెడ్డీ గ్యాంగ్ కలకలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మియాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చెడ్డీ గ్యాంగ్ సంచారం కలకలం రేపుతోంది. హఫీజ్‌పేట్‌లోని ఓ ప్రయివేటు స్కూల్‌లో శనివారం అర్ధరాత్రి కొందరు దుండగులు చోరీకి తెగబడ్డారు. చెడ్డీలు ధరించి మారణాయుధాలతో వచ్చిన వీరు.. స్కూల్ కార్యాలయంలోని కౌంటర్‌లో రూ.7.85 లక్షల నగదును దోచుకెళ్లారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సిసి కెమెరాలో రికార్డు అయ్యాయి. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గుడిసెలు కూల్చివేత దుర్మార్గం

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం భూమిలో గుడిసెలు వేసుకున్న వారిపై పార మిలటరీ ద్వారా దాడి చేయించడాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖండించింది. ఈ మేరకు ఆదివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్. వెంకట్ రాములు ఒక ప్రకటన విడుదల చేశారు. అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుడిసెవాసులు, నాయకులపై భౌతిక దాడికి పాల్పడిన పారా మిలటరీ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

జనగామ జిల్లా బచ్చన్నపేట గోపాల్ నగర్‌లో సర్వే నెంబర్ 174లో ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకుని గత కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారామెలటరీని ఉపయోగించి గుడిసెలను దౌర్జన్యంగా కూల్చింది. అడ్డొచ్చిన సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చుంచు విజయేందర్‌తో పాటు మరో ఏడు మందిని ఈడ్చుకుంటూ లాక్కెళ్లి నర్మెట్ట పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది...అని వారు తెలిపారు. తక్షణమే అరెస్టు చేసిన నాయకులను కార్యకర్తలను ఎలాంటి కేసులు లేకుండా భేషరతుగా విడుదల చేయాలని కోరారు. గుడివాసులు నష్టపోయిన వస్తువులకు జిల్లా కలెక్టర్ నష్టపరిహారం చెల్లించాలనీ, గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇళ్ల జాగా ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గేట్లెత్తిన కాంగ్రెస్

- కారు దిగుతున్న నేతలు
- కమలాన్ని దాటుకుంటూ హస్తం గూటికి...
- మొన్న జితేందర్‌రెడ్డి, పసునూరు
- నిన్న ఎంపి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం
- గ్రేటర్ హైదరాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు త్వరలో ఖాళీ.!
- బిజెపి ఎంపీ సోయంబాపూరావు కూడా...
- ఇంకొంతమంది నేతలు చేరేందుకు రెడీ !

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మేం గేట్లు తెరిస్తే బిఆర్ఎస్ ఖాళీ అవుతుంది. ఇవి ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డి అన్న మాటలు. ఇప్పుడు అన్నంత పని చేశారు. బిఆర్ఎస్ నేతలు కారు దిగి హస్తం గూటికి వరుస కడుతున్నారు. ఒకవైపు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టుతో బిఆర్ఎస్ నేతలు బాధలో ఉన్నారు. మరోవైపు పాత వారిని కాదని బిజెపి కొత్త వారికి టికెట్లు ఇచ్చి, పెద్ద పీట వేయడంతో ఆ పార్టీలో అంతర్గత అసంతృప్తి రగులుతున్నది. ఆ రెండు పార్టీలు అంతర్గత ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా గేట్లెత్తేయడంతో ప్రత్యర్థి పార్టీలకు ఊహించని షాక్ తగిలింది. ఈ పరిణామాలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి. మొన్న బిజెపి నేత, మాజీ ఎంపి జితేందర్‌రెడ్డి, సిట్టింగ్ ఎంపి పసునూరి దయాకర్ కాంగ్రెస్ గూటికి చేరారు. నిన్న చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్‌లో బలమైన బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో ఈ చేరికలు ఊపందుకున్నాయి. ఇదే ఊపులో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు వరదలా వస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఎన్నికలలోపు అందరూ చేరడం పూర్తిగానే, గ్రేటర్ నుంచి ఒకరో, ఇద్దరికో మంత్రి పదవులు కూడా ఇస్తారనే టాక్ నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర మంతటా కాంగ్రెస్ గాలి వీచినా, గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం కాంగ్రెస్‌కు ఎదురు గాలి వీచింది. ఈ లోటు పూడ్చుకునేందుకు చాలా కాలంగా కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో 14 సీట్లు గెలువాలనే ఎన్నికల వ్యూహంలో భాగంగా నే కాంగ్రెస్ నాలుగు నియోజకవర్గాలకే అభ్యర్థులను ప్రకటించింది. మిగతా 13 నియోజకవర్గాలలకు అభ్యర్థులను ప్రకటించకుండా వ్యూహాత్మకంగా ఆపింది. ఇతర పార్టీల నుంచి బలమైన నేతలు వచ్చే అవకాశం ఉండడంతో వారి కోసమే టికెట్లను ఆపిందని ఆ వర్గాలు అంటున్నాయి. బిఆర్ఎస్ పార్టీకి చెందిన 26 మంది ఎమ్మెల్యేలు కలిసికట్టుగా టిఆర్ఎస్ ఎల్పీని సిఎల్పిలో విలీనం చేస్తారనే టాక్ వైరల్ అవుతున్నది. అయితే కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వారు అసంతృప్తికి గురి కాకుండా కాంగ్రెస్ ముందుస్తు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే 37 కార్పొరేషన్లకు చైర్మన్లను ప్రకటించి జాతరను తలపించింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో టికెట్ దక్కని నాయకులకు, అనుబంధాల సంఘాల నాయకులకు చైర్మన్ పదవులిచ్చి అసంతృప్తిని చల్లారించింది. త్వరలోనే మరికొంత మందికి కార్పొరేషన్ పదవులు ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే బిఆర్ఎస్ 7 సీట్లకు అభ్యర్థులను ఎంపిక చేసింది. ఆ పార్టీ ప్రకటించిన అభ్యర్థుల్లో కూడా చాలా మంది నాయకులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. చెవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డిని ప్రకటించినప్పటికీ ఆయన కాంగ్రెస్‌లో చేరారంటే, బిఆర్ఎస్ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. బిజెపి 15 పార్లమెంటు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. మరో రెండింటికి ప్రకటించాల్సి ఉంది. ఈ క్రమంలో సీటు దక్కని బిజెపి ఎంపి సోయం బాపూరావు కూడా కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నదని పార్టీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల దగ్గర పడే కొద్దీ ఈ చేరికలు మరింత ఊపందుకునేలా కాంగ్రెస్ పార్టీ వ్యూహత్మంగా ముందుకు సాగుతున్నది.

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD.
O.S.3047 Of 2023

Between:
Union Bank of India.
[A Govt. of India undertaking]
[formerly] Andhra Bank Credit card Division rep. by its, Senior Manager Koti, Sultan Bazar, Hyderabad.
...Plaintiff.
And
Mr.Panem Joseph, S/o Mr.Janaiah, Aged 54yrs, Occ: Doctor, H.No.11-10-930/14, Raparthinagar, Khanunam-507002.
..Defendant.

Whereas the above named Plaintiff has filed the above suit O.S.No. 3047 of 2023 on the file of Hon'ble II Junior Civil Judge, City Civil Court, Hyderabad against you for recovery of due amount of Rs. 2,03,902.66 pertaining to your credit card no. 6528-63xx-xxxx-0003.You are therefore directed to appear in person or through Advocate on 28-03-24 at 10.30 a.m. to answer the suit, failing which the suit will be decided exparte. Take notice accordingly.

[AS PER THE COURT ORDER]
M.V.Nagaraj.
V.V.S.Annaram
Counsel for Plaintiffs.
H.No. 1-1-336/18, Chikkadapalli, Hyderabad. Ce11:98496-66587

IN THE COURT OF THE 82ND ACC & SJ COMMERCIAL COURT JUDGE AT BENGALURU CCH. No. 83
COM. O.S. No. 1297/2023

Mr. AVATAR SINGH @ AJAYPAL SINGH, S/o. Sri. Madhu Singh, Aged about 27 years, Proprietor 'Rajshree Distributors', at No. 511/2, 50 Feet Road, near 15 'F' Bus Stop, Kumara Swamy Layout 2nd Stage, Bengaluru-560 111. Id: ajaypal19611@gmail.com **...PLAINTIFF**
Vs.
M/s. KATIE COSMETIC PVT. LTD & others
...DEFENDANTS

SUMMONS TO DEFENDANTS UNDER ORDER V RULE 20 OF CPC

D-3 : M/s. SWADESI FOODS AND OILS,
Reptd. by its MD: **SUNDEEP KUMAR,**
Mail Id : sundeep.elite@gmail.com
H.No: 1-9-648, Street 6, Adikmet Main Road, Maurya Towers, Vidyanagar, Hyderabad, Telangana-500044.
Cell : 8008521596, 9948012299
swadesifoodandoils@gmail.com

WHEREAS, the Plaintiff has filed the above Commercial Original Suit against you and others for recovery of **Rs. 9,80,000/- (Rupees Nine Lakhs Eighty Thousand only).** Along with present and future interest @ 24% per annum compounded quarterly plus cost towards other charges. Therefore, you are hereby Summoned to appear before CCH-83 court **on 18.04.2024 at 11.00 AM** either in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above Commercial Original Suit. Take notice that in default of your appearance on the day mentioned the above Commercial Original Suit will be heard and decided Ex-parte.

Given under my hand and seal of the court on this the 12th day of March 2024.

By order of the Court, Sheristedar, City Civil Court, Bengaluru.
Advocates for Plaintiff :
D. NARAYANA SHETTY & CHANDRA SHEKAR .G.A.
Nature Law Associates
No. 4, 1st Floor, 4th Main, K.R. Road, Obalappa Garden, Bengaluru - 560 070.

కడగండ్లు మిగిల్చిన వడగండ్లు

- భారీ వర్షంతో పంటలకు తీవ్ర నష్టం
- కామారెడ్డి జిల్లాలో 20 వేల ఎకరాల్లో పంటకు నష్టం
- పరిశీలించిన అధికారులు, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షం రైతన్నలను అతలాకుతలం చేసింది. వడగండ్లు కురిసి అన్నదాతల కడగండ్లు మిగిల్చింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వడగండ్ల వర్షంతో తీవ్ర నష్టం వాటిల్లింది.

ఈదురుగాలుల ధాటికి వరి పైరు నేలకొరగగా, వడ్లు రాలిపోయాయి. పంట చేతికి వస్తున్న దశలో కురిసిన అకాల వర్షం తీవ్రంగా నష్టపరిచిందని రైతులు వాపోతున్నారు. వరితో పాటు మొక్కజొన్న, జొన్న, మామిడికి తీవ్ర నష్టం కలిగింది. కాగా పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. అయితే పలు చోట్ల అధికారులు, ఎమ్మెల్యేలు పత్తా లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 24 మండలాలు ఉండగా 15 మండలాల్లో భారీ ఎత్తున పంట నష్టం జరిగినట్టు జిల్లా వ్యవసాయ విస్తీర్ణ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. 15 మండలాల్లో 130 గ్రామాల్లో 14,553 మంది రైతులకు చెందిన 20,071 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. వరి, మొక్కజొన్న, గోధుమ, జొన్న, వేరుశనగ, పెసర తదితర పంటలు వేయగా 33 శాతం పంటలు దెబ్బతిన్నాయన్నారు. కామారెడ్డి మండలం కొట్టాలపల్లి గ్రామంలో 250 ఎకరాల్లో ఉల్లిగడ్డ, వరి, మొక్కజొన్న, పెసర, మినుము, మామిడి తోటలు,

వడగండ్ల వానవల్ల ఒరిగిపోయిన పంట పైరు

కూరగాయలు.. తదితర పంటలు 90 శాతం వరకు నష్టపోయాయి. కామారెడ్డి రూరల్ మండలంతో పాటు భిక్కనూర్, దోమకొండ మండలాల్లో నేలవాటిన పంటలను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీ, మాజీ విప్ గంపగోవర్ధన్, అధికారులు, నాయకులు పరిశీలించారు. బాన్సువాడలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్రెడ్డి పరిశీలించారు. బోధన్, సాలూర, ఎడపల్లి మండలాల్లో దెబ్బతిన్న వరి పంటను ఎమ్మెల్యే సుదర్శన్రెడ్డి, వ్యవసాయాధికారులు పరిశీలించారు. రైతులు అధైర్య పడొద్దని, పంట నష్టం వివరాలు సేకరించి నివేదిక సమర్పించిన తర్వాత ప్రభుత్వం సాయం చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం తీరుతో రైతుల పంటలకు బీమా లేకుండా పోయిందని, దాంతో రైతులు నష్టపోతున్నట్టు తెలిపారు. సహకార సంఘాలను నిర్వీర్యం చేసి ఇన్సూరెన్స్ లేకుండా చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పునరుద్ధరించి పంటలకు బీమా సదుపాయం కల్పిస్తామని ఎమ్మెల్యే సుదర్శన్రెడ్డి హామీ ఇచ్చారు. బిచ్కుంద మండలంలో వరితో పాటు మొక్కజొన్న, మామిడికి తీవ్ర నష్టం వాటిల్లింది. అయినా అధికారులు, పాలకులు ఎవరూ వచ్చి పరిశీలించలేదని, నష్టం అంచనా వేయలేదని రైతులు వాపోతున్నారు.

మోడీ ప్రభుత్వాన్ని యువత నిలదీయాలి : పివైఎల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తాననీ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చిన మోడీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో యువతను మోసం చేశారని, యావత్ యువతరం మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెఎస్ ప్రదీప్, వి అజయ్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. హైదరాబాద్లోని మార్క్స్ భవన్లో ఆ సంఘం రాష్ట్ర కమిటీని నిర్వహించారు. మోడీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని తెలిపారు. ఉపాధి అవకాశాలు తగ్గాయని పేర్కొన్నారు. కార్పొరేట్లకు మాత్రం లక్షల కోట్లు రుణ మాఫీ చేశారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగాల్లో కోత పడుతున్నదని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. మార్చి 23న షహీద్ భగత్ సింగ్, రాజ్గురు, సుఖదేవ్ల వర్ధంతి సభలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో పివైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్, రవికుమార్, సహాయ కార్యదర్శులు ప్రతాప్, రాకేశ్, కోశాదికారి బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో విమానం ఆలస్యం

- విమానంలో సిఎం రేవంత్, మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సాంకేతిక లోపంతో సమయానికి బయలుదేరాల్సిన ఇండిగో విమానం ఆలస్యమైంది. ఆదివారం ఎయిర్ పోర్టు నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటలకు ముంబాయి వెళ్లాల్సిన ఇండిగో విమానం (6ఈ 5099) ఓవర్ హీట్ సమస్య తలెత్తడంతో ఎసి సమస్య తలెత్తి ఆలస్యమైంది. ఈ విమానంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రి పొన్నం ప్రభాకర్తోపాటు పలువురు ప్రముఖులు ఉన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారించడంతో విమానం ముంబాయికి బయలుదేరింది.

మీడియాతో మాట్లాడుతున్న అరూరి, పక్కన కేంద్రమంత్రి కిషన్రెడ్డి

బిజెపిలోకి బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నేత అరూరి రమేశ్ ఆదివారం బిజెపిలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్రెడ్డి ఆయనకు కాషాయ కండువా కప్పి ఆహ్వానించారు. బిఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రమేశ్.. శనివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. బిఆర్ఎస్ను వీడనున్నారనే ప్రచారం తర్వాత ఇటీవల మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు, ముఖ్యనేతలు ఆయన్ను బుజ్జగించారు. అధినేత కెసిఆర్ దగ్గరకు తీసుకెళ్లి సముదాయించినా ఫలితం లేకపోయింది. అరూరి రమేశ్ బిజెపి తరపున వరంగల్ అభ్యర్థిగా బరిలో ఉండే అవకాశముంది. ఈ మేరకు ఆ పార్టీ నుంచి ఆయనకు హామీ లభించినట్లు సమాచారం.

నాటి మేటి నటుల పాటలతో సందడి

ప్రజాశక్తి - కల్చరల్

నాటి మేటి నటులు శోభన్ బాబు, కృష్ణం రాజు, కృష్ణ నటించిన చిత్రాలలోని పాటలతో గాయనీ గాయకులు సుమారు పది గంటలు పాటు సందడి చేశారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా దీక్షితులు కళా వేదికపై ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ విజయ క్రియేషన్స్ నిర్వహణలో మధురమైన పాటలను పేరి నాగేశ్వర రావు, విజయ లక్ష్మి ప్రధాన గాయకులుగా పలు పాటలు అలపించగ టిఎస్రావు లలిత తదితరులూ పాటలలో పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో అతిథులుగా గాయకుడు త్రినాథ రావు కళాభిమాని పేరి కామేశ్వరరావు వై మణిదీప్, కందల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ విజయ క్రియేషన్స్ స్థాపకులు నాగేశ్వరరావు, విజయ లక్ష్మి సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నారని ఇటీవల విద్య సంస్థలోని పిల్లలకు పుస్తకాలు విద్యార్థులకు అవసరమైన ఇతర వస్తువులు అందించి వారి సహృదయత చూపారన్నారు. సంస్కృతిక సంస్థలు సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని ఇందుకు విజయ క్రియేషన్స్ ఆదర్శం అన్నారు.

ఆర్టిసి కార్మికుల హెచ్ఆర్ఎలో కోత

- బల్దియా పరిధిలో పనిచేసేవారికి అధిక నష్టం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికులకు పిఆర్సితో వేతనాలు పెంచిన ఆర్టిసి యాజమాన్యం మరోవైపు హెచ్ఆర్ఎలో కోత పెట్టింది. పనిచేసే ప్రాంతాన్ని ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఎ)ను అన్ని స్లాబ్లలో మార్పులు చేసింది. హెచ్ఆర్ఏ గరిష్ఠంగా ఆరు శాతం, కనిష్ఠంగా 1 శాతం తగ్గనుంది. ముఖ్యంగా జిహెచ్ఎంసి పరిధిలో పని చేసే ఆర్టిసి కార్మికులకు అధిక నష్టం కలగనుంది. ఆర్టిసి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9న ఫిట్మెంట్ ప్రకటించింది. 2017 పిఆర్సికి సంబంధించి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 16 శాతం మధ్యంతర భృతి ప్రకటించగా, తాజాగా 21 శాతం ఫిట్మెంట్ను ప్రకటించింది. అయితే ఆర్టిసి యాజమాన్యం ఇటీవల జారీ చేసిన సర్క్యులర్లో హెచ్ఆర్ఏలు తగ్గించింది. దీంతో ఆ మేరకు ఫిట్మెంట్ ప్రయోజనాలు ఆర్టిసి కార్మికులకు తగ్గే అవకాశాలున్నాయి. ఆర్టిసిలో హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్లు జిహెచ్ఎంసి పరిధిలో ఉన్నాయి. జిహెచ్ఎంసిలో ఇప్పటివరకు 30 శాతం హెచ్ఆర్ఎ ఇస్తున్నారు. ఆర్టిసి యాజమాన్యం తాజాగా 24 శాతానికి పరిమితం చేసింది.

అంటే ఇక్కడ పనిచేసే ఉద్యోగులకు ఆరు శాతం హెచ్ఆర్ఎ తగ్గనుంది. ఆర్టిసిలోని 42 వేల పైచిలుకు కార్మికుల్లో 20 వేలకు పైగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే పని చేస్తున్నారు. అదే విధంగా కరీంనగర్, ఖమ్మం, మహబూబ్నగర్, నిజామాబాద్, గోదావరిఖని, వరంగల్లో పనిచేసే వారికి 20 శాతం ఉన్న హెచ్ఆర్ఎను 17 శాతానికి..ఆదిలాబాద్, నిర్మల్, బోధన్, కామారెడ్డి, ఆర్మూర్, సిరిసిల్ల, జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి, సిద్దిపేట, జహీరాబాద్, సంగారెడ్డి, వికారాబాద్, తాండూరు, వనపర్తి, గద్వాల, నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, జనగామ, కొత్తగూడెం, మంచిర్యాలలో పనిచేసేవారికి హెచ్ఆర్ఎను 14.5 నుంచి 13 శాతానికి.. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో పనిచేసేవారికి 12 నుంచి 11 శాతానికి హెచ్ఆర్ఎను తగ్గించింది.

బహు సాహితీ ప్రక్రియల ప్రజ్ఞానిధి చిలకమర్తి లక్ష్మీనరసింహం

ప్రజాశక్తి - కల్చరల్

పౌరాణిక నవలలు నాటకాలు ప్రహసనాలు అనువాదాలు పలు సాహితీ ప్రక్రియల ప్రజ్ఞా నిధి చిలకమర్తి లక్ష్మీనరసింహం అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గానసభ నిర్వహణలో జరుగుతున్న దశాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా చిలకమర్తి లక్ష్మీనరసింహం సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ విశ్వేశ్వర రావు పాల్గొని మాట్లాడుతూ రాజమండ్రిలో జన్మించిన చిలకమర్తి నాడు పలు సంఘసంస్కరణ కార్యక్రమాలు చేపట్టి కందుకూరి వీరేశలింగం పంతులు అడుగుజాడలో ఆదర్శవంతంగా నిలిచారని అన్నారు. అయన నాడే దళిత వర్గాల విద్య కోసం విద్యాలయం స్థాపించి ఉచితంగా చదువులు చెప్పించారని వివరించారు. హాస్య అవధాని, జర్నలిస్ట్ శంకర నారాయణ మాట్లాడుతూ హాస్య రచనలోనూ చిలకమర్తి దిట్ట అని అయన రచించిన గణపతి నవల ఇందుకు ఉదాహరణ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంచే కళా ప్రపూర్ణ అవార్డు అందుకున్న చిలకమర్తి రాసిన గయోపాఖ్యనం నాటకం నేటికి ప్రదర్శిస్తున్నారని తెలిపారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో కవి చక్రవర్తి తంగిరాల, సమాజిక వేత్త వైకుంఠం పాల్గొన్నారు.

పేదల గుడిసెలపై పోలీసుల దౌర్జన్యం దుర్మార్గం

- తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పేదల గుడిసెలపై పోలీసుల దౌర్జన్యం దుర్మార్గమని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనగామ జిల్లా బచ్చన్నపేట గోపాల్నగర్లోని సర్వే నెంబర్ 174లో ఉన్న ప్రభుత్వ భూమిలో నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారనీ, వాటిని పోలీసులు బలవంతంగా తొలగించి దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యవాదులందరూ ఈ ఘటనను ఖండించాలని కోరారు. ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని చెప్తూనే పేదల గుడిసెలపై దౌర్జన్యం చేయడమేంటని ప్రశ్నించారు. మహిళలపై మగ పోలీసులు పిడి గుద్దులు గుద్దడం అన్యాయమని తెలిపారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. వారికి ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా రూ.5 లక్షలివ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా భూ పోరాట కేంద్రాల్లో ప్రజాసంఘాల నాయకులు, ప్రజలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

ఎఐ, మెషిన్ లెర్నింగ్పై హైదరాబాద్లో జాతీయ సదస్సు

- స్వేచ్ఛా వ్యవస్థాపకుడు కిరణ్ చంద్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ పై భారతదేశంలో అతిపెద్ద కాన్ఫరెన్స్ ఏఐ డేస్ 2024 హైదరాబాద్లో ఈనెల 30, 31వ తేదీలలో నిర్వహించనున్నట్లు స్వేచ్ఛా వ్యవస్థాపకుడు వై కిరణ్ చంద్ర తెలిపారు. గచ్చిబౌలిలోని స్వేచ్ఛా తెలంగాణ, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సదస్సుకు జేఎన్టీయూ హైదరాబాద్ వేదిక కానుందన్నారు. ఈ సదస్సులో రెండు వేల మందికి పైగా ఐటీ నిపుణులు, పరిశోధకులు, స్టార్టప్లు, విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా గల 70 కి పైగా స్పీకర్లు పాల్గొంటారన్నారు. ఈ సదస్సుతో హైదరాబాద్ ఏఐ రాజధానిగా మారేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. 'ఏఐ4సొసైటీ' నినాదంగా స్వేచ్ఛా భాగస్వాములతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. ఎఐ డేస్ వివిధ రంగాలకు చెందిన నిపుణులను ఒకచోటకు చేరుస్తుందన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హెల్త్కేర్, అగ్రిటెక్, ఫిన్టెక్, సెమీ కండక్టర్స్, ఎడ్యుటెక్, వివిధ స్టార్టప్లు - సమాజ శ్రేయస్సు కోసం ఏఐని నిర్మించడంలో ముందుకు సాగే మార్గం కోసం గూగుల్, ఫేస్బుక్ (మెటా) మైక్రోసాఫ్ట్, క్వాల్కామ్, మైక్రాన్, ఓజోనెటెల్, టెక్ వేదిక, డిజీక్వాన్టా, ఆర్కా మీడియా వర్క్స్ వంటి ఇతర సంస్థల స్పీకర్లు ఈ చర్చల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐ పాలన, విధానపరమైన అంశాలపై చర్చలు జరుగుతాయని చెప్పారు. ఈ సదస్సులో తెలుగు ఏఐ వాయిస్ అసిస్టెంట్ను



స్వేచ్ఛ కమిటీ సభ్యులు

ప్రారంభించనున్నామని తెలిపారు. రైతులు, ఫ్రంట్లైన్ హెల్త్కేర్ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, ఇతరులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతాలను యాక్సెస్ చేయడానికి వీలు కల్పిస్తుందన్నారు. ఈ ప్రాజెక్ట్ మాతృభాషలో సొంత స్వరాన్ని ఉపయోగించి ఏఐతో పరస్పర చర్యకు అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ కాన్ఫరెన్స్కు పద్మభూషణ్ డాక్టర్ విఎస్ రామచంద్రన్, మొబైల్ పేమెంట్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా మాజీ చైర్మన్ ప్రొఫెసర్ గౌరవ్ రైనా, గూగుల్లో ఏఐ/ఎంఎల్ లీడర్ డాక్టర్ ఆశిష్ టెండూల్కర్, ఫౌండర్ సీటీవో ఓజోనెటెల్ చైతన్య, టెక్ మహీంద్రా విపి నాగ్ మల్లాది, స్వేచ్ఛా వ్యవస్థాపకుడు వై కిరణ్ చంద్ర, సీనియర్ సలహాదారు, సాలమండర్ నాగి వీ, ఫేస్బుక్ ఇండియా డైరెక్టర్ సునీల్ అబ్రహం, టెక్ వేదిక ఫౌండర్ సిఇఒ సాయి ఎస్, ఆర్కా మీడియా వర్క్స్ వ్యవస్థాపకుడు, బాహుబలి సిరీస్ నిర్మాత శోభు యార్లగడ్డ, తదితరులు హాజరుకానున్నారు.

మోగుతున్న డేంజర్ బెల్స్

- కరీంనగర్ పట్టణంలో మున్ముందు కష్ట'మే'నా!
- డెడ్ స్టోరేజీకి ఎల్ఎండి
- 24 టిఎంసిల సామర్థ్యం ఉన్న డ్యామ్లో ఉన్నవి ఆరు టిఎంసిలే!
- మూడేళ్లలో ఇదే సమయానికి 15 టిఎంసిలకు తగ్గని డ్యామ్ నిల్వ
- రాష్ట్రంలో పలు ప్రాజెక్టుల్లో తగ్గిన నిల్వలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరీం'నగరానికి' తాగునీరందించే ఎల్ఎమ్డి (దిగువమానేరు) డ్యామ్ డెడ్స్టోరేజీకి చేరింది. 24.034 టిఎంసిల సామర్థ్యం ఉన్న జలాశయంలో ప్రస్తుతం 6.835టిఎంసిల నీళ్లే ఉన్నాయి. 4.5లక్షల జనాభా ఉన్న కరీం'నగర' దాహార్తికి కనీసం 8టిఎంసిలు ఉంటే తప్ప వేసవి ముప్పు నుంచి బయటపడటం కష్టమే. అలాంటిది మధ్యమానేరు నుంచి 3500 క్యూసెక్కుల నీళ్లు వదులుతున్నామని సంబంధిత అధికారులు చెబుతున్నా.. ఎల్ఎమ్డీ నుంచి 4500క్యూసెక్కులు కాకతీయకెనాల్కు వదులుతుండటం గమనార్హం. మూడేండ్లలో ఏనాడూ 15టీఎంసీలకు తగ్గకుండా నీటి నిల్వ ఉన్న ఎల్ఎమ్డీ ఇప్పుడు అడుగంటుతుండటంతో నగర ప్రజల్లో ఆందోళన మొదలైంది. పక్షం రోజుల కిందటే నగరంలో నీటి ఎద్దడి మొదలవగా.. ఇప్పుడు డెడ్స్టోరేజీకి చేరిన డ్యామ్తో మున్ముందు కష్ట'మే'నన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

తాగు నీటికి ఎక్కడ కూడా ఇబ్బందులు లేవని, ఇప్పటికే శ్రీరాం సాగర్ నుంచి 3టీఎంసీల నీరు మిడ్ మానేరుకు చేరుకున్నాయని సంబంధిత శాఖ అధికారులు.. ఈనెల 9న రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన సమీక్షలో వెల్లడించారు. మధ్యమానేరు (ఎమ్ఎమ్డీ)లో 12టీఎంసీల నీళ్లు ఉన్నాయని, దిగువమానేరు (ఎల్ఎమ్డీ)లో 7.5టీఎంసీల నిల్వలున్నాయన్నారు. మధ్యమానేరు నుంచి కొన్ని రోజులుగా 3500 క్యూసెక్కుల నీటిని వదులుతున్న అధికారులు తాగునీటి అవసరాల కోసం ఈనెల 11 నుంచి 2 టీఎంసీల నీటిని ఎల్ఎమ్డీలో చేర్చుతామని చెప్పారు. వారం కిందటి వరకూ 12టీఎంసీల నీళ్లు ఉన్న మధ్యమానేరులో ప్రస్తుతం 10.88టీఎంసీలే ఉన్నాయి. ఎల్ఎమ్డీకి 2 టీఎంసీల నీళ్లు వదిలినట్టు కనిపిస్తున్నా.. దిగువమానేరు నుంచి కాకతీయ కెనాల్కు కొద్దిరోజులుగా 4500క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. దాంతో తాగునీటి కోసం నీళ్లు వదిలినా.. వారం కిందటివరకూ 7.5టీఎంసీలు ఉన్న డ్యామ్ ప్రస్తుతం 6టీఎంసీలకు చేరి డెడ్స్టోరేజీలో ఉంది.

నగరానికి మొదలైన తాగునీటి ఎద్దడి

స్మార్ట్సిటీగా ఎదిగిన కరీం'నగరం'లో ప్రస్తుతం సుమారు 4.5లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. శివారు గ్రామాలైన అల్గునూర్, వల్లంపహడ్, సదాశివపల్లి, పద్మనగర్, రేకుర్తి, సీతారాంపూర్, తీగలగుట్టపల్లిని 2019లో విలీనం చేసుకుని 60 డివిజన్ల మున్సిపల్ కార్పొరేషన్గా ఎదిగింది. నగరం మొత్తంగా 16 వాటర్ ట్యాంకులు, సుమారు 60వేల నల్లా కనెక్షన్లు ఉండగా.. రోజువారీగా 66 మిలియన్స్ లీటర్స్ ఫర్ డే (ఎమ్ఎల్డీలు) తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే రోజువారీ డిమాండ్కు తగ్గట్టుగా ఈ సరఫరా కూడా సరిపోవడం లేదు. పైగా విలీన గ్రామాల్లో నల్లా సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఉండగా.. హైలెవల్ ప్రాంతాల్లో రోజు విడిచి రోజు.. అదీ కొద్దిసేపు మాత్రమే నల్లా నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా సరస్వతినగర్, తీగలగుట్టపల్లి డివిజన్లలో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తుండగా.. హైలెవల్ ప్రాంతాలైన విద్యానగర్, సుభాష్నగర్, మంకమ్మతోట, సప్తగిరికాలనీ, మార్కండేయనగర్, చైతన్యపురి, భాగ్యనగర్, బుట్టిరాజారాం కాలనీల్లో రోజు విడిచి రోజు కొద్ది సేపే నీరు సరఫరా చేస్తున్నారు. కోర్టు, విద్యానగర్, రాంనగర్, ఎస్ఆర్ఆర్, అంబేద్కర్నగర్ వాటర్ట్యాంక్ రిజర్వాయర్ల పరిధిలో నీటి సరఫరాకు ఇబ్బదులు వచ్చేలా ఉన్నాయని సంబంధిత మున్సిపల్ అధికారులు చెబుతుండగా.. మార్చి 6న జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశాల్లోనూ తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సారెస్పీ నీటిని ప్రభుత్వం విడుదల చేయాలని తీర్మానమూ చేయడం గమనార్హం.

పలు ప్రాజెక్టులోనూ తగ్గిన నీటిమట్టం

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్(ఎస్సారెస్పీ) పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(90.3 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1066.8 అడుగుల(23.26 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి ఎస్సారెస్పీలో 1074.10 అడుగుల(37.612 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు తెలిపారు. వివిధ కాలువలకు, ఎత్తిపోతల పథకాలకు 9874 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగుల (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1394.46 అడుగుల(6.476 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. ప్రధాన కాలువలకు 1156 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 74.00 మీటర్లకు గాను 71.12 మీటర్ల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం అన్ని గేట్లను మూసివేశారు. అవుట్ ఫ్లో ఎడమ కాలువకు 60 క్యూసెక్కులు, కుడి కాలువకు 3 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

513.90 అడుగులకు 'సాగర్' నీటిమట్టం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం డెడ్ స్టోరేజ్కు చేరుకుంటుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు (312 టీఎంసీలు) కాగా ప్రాజెక్టు కనీస నీటిమట్టం 510 అడుగులు. ప్రస్తుతం 513.90 అడుగుల (138.3868 టీఎంసీలు) వద్ద నీరు నిల్వ ఉంది. మరో 3 టీఎంసీల నీరు తగ్గితే రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరుకోనున్నది. ఎస్ఎల్బీసీ ద్వారా 1350క్యూసెక్కుల నీటిని మాత్రమే దిగువకు విడుదల చేస్తున్నారు.

నీటి ఎద్దడి ఉందనే అపోహ వద్దు.. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని ప్రతిపక్షాలు అపోహ సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అలా చేయవద్దన్నారు. ఈనెల 9న ఇరిగేషన్, మిషన్భగీరథ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన.. తాగునీటి విషయమై ప్రకటన విడుదల చేశారు. ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మాత్రమే కేవలం నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచిస్తున్నామని పేర్కొన్నారు. కరీంనగర్లో తాగు నీటికి ఇబ్బందులు ఉండకుండా చూడాలని పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా సహా కలెక్టర్ పమేలా సత్పతికి సైతం ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.

హస్తం టికెట్ ఎవరికో?

- ఆశావహుల్లో హైరానా.. పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ
- తెరపైకి రోజుకో కొత్త పేరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మల్కాజిగిరి లోక్సభ సెగ్మెంట్ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులకు టికెట్ టెన్షన్ పట్టుకుంది. మల్కాజిగిరి అభ్యర్థిని ఎంపిక చేయడం కాంగ్రెస్కు కత్తి మీద సాములా మారినట్టు తెలుస్తోంది. సిఎం రేవంత్రెడ్డి సిట్టింగ్ స్థానం కావడం, బలమైన అభ్యర్థులు లేకపోవడంతో ఎంపిక క్లిష్టంగా మారినట్టు సమాచారం. ఇప్పటికే బిఆర్ఎస్, బిజెపి తమ అభ్యర్థులుగా రాగిడి లక్ష్మారెడ్డి, ఈటల రాజేందర్ను ప్రకటించాయి. బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తుండగా.. రోజుకో కొత్త పేరు తెరపైకి వస్తోంది.

అభ్యర్థి వేటలో అధిష్టానం

మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్పల్లి, ఎల్బీనగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించకుండా పెండింగ్లో పెట్టడంతో అంతా టెన్షన్ వాతావరణం నెలకొంది. బిఆర్ఎస్, బిజెపి ప్రత్యర్థులకు దీటైన అభ్యర్థిని రంగంలోకి దించాలని పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం ఆలోచిస్తోంది. దాంతో మల్కాజిగిరి అభ్యర్థి ఎంపిక రసకందాయంలో పడింది. గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్న అధికార కాంగ్రెస్.. ఆ దిశగా మల్కాజిగిరి స్థానంపై కసరత్తు ముమ్మరం చేసింది. ఇదిలా ఉంటే, పార్టీ అధిష్టానం మాత్రం అభ్యర్థుల ఎంపిక విషయంలో అన్ని అంశాలనూ పరిగణలోకి తీసుకుంటోంది. సామాజిక సమీకరణాలు, అంగ, అర్థబలం ఆధారంగా బలమైన నాయకులను బరిలో దించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నెల 14, 15 తేదీల్లో అభ్యర్థిని ప్రకటిస్తామని మేడ్చల్ ప్రజా దీవెన సభలో సిఎం రేవంత్రెడ్డి ప్రకటించినా.. ఆ దిశగా అడుగులు పడలేదు.

తెరపైకి కొత్త పేర్లు

మల్కాజిగిరి అభ్యర్థి విషయంలో రోజుకో పేరు తెరపైకి వస్తోంది. ఇప్పటి వరకు సినీనటుడు అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించినా, రెండు, మూడు రోజులుగా జరుగుతున్న రాజకీయ పరిణామాలను చూస్తుంటే కొత్త వారు బరిలో ఉండేలా కనిపిస్తోంది. నాగర్కర్నూల్ మాజీ

ఎమ్మెల్యే మర్రి జనార్దన్రెడ్డి, చేవెళ్ల సిట్టింగ్ ఎంపి రంజిత్రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్పర్సన్ సునీతా మహేందర్రెడ్డి పేర్లు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు పోటీలో ఉంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది. అభ్యర్థి ఎవరనేది ఇప్పటి వరకు అధిష్టానం ఎటూ తేల్చకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా, ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్లో చేరిన వారికి కొన్ని చోట్ల లోక్సభ టికెట్లు కేటాయించారు. మల్కాజిగిరి విషయంలో ఈ సూత్రం పాటిస్తారా..? లేక పార్టీలోనే కొనసాగుతున్న వారికి టికెట్ ఇస్తారా..? అనేది తేలాల్సి ఉంది.

సునిత లేదా మర్రి జనార్దన్రెడ్డికే ఛాన్స్

పార్లమెంట్ ఎన్నికల ముహూర్తం దగ్గర పడింది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ కూడా ప్రకటించింది. దాంతో మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే ఉత్కంఠకు ఇంకా తెర పడలేదు. నాలుగు, ఐదు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నా.. వికారాబాద్ జెడ్పీ చైర్మెన్ సునీతా మహేందర్రెడ్డి, నాగర్కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్రెడ్డిలో ఎవరికో ఒకరికి టికెట్టు దక్కేలా కనిపిస్తోంది. ఇక చేవేళ్ల సిట్టింగ్ ఎంపి రంజిత్రెడ్డి పోటీ చేస్తారని తొలుత ప్రచారం జరిగిన సమయంలో బిజెపి అభ్యర్థిగా ఈటల రాజేందర్ను బరిలో నిలవడంతో రంజిత్రెడ్డి యూటర్న్ తీసుకుని తన సిట్టింగ్ స్థానమైన చేవేళ్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగుతున్నట్టు సమాచారం. మర్రి జనార్ధన్రెడ్డి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాకపోవడంతో చేవెళ్ల సీటు ఆశించి పార్టీలో చేరిన సునీతా మహేందర్రెడ్డికే మల్కాజిగిరి టికెట్ కేటాయిస్తారని చర్చ నడుస్తోంది. మల్కాజిగిరి అభ్యర్థి ఎవరో తెలియాలంటే మరో రెండు, మూడు రోజులు వేచి చూడాల్సిందే..!